# లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్ము దోచుకోలేరు: అమిత్ షా



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
బిహార్‌లో జంగిల్‌రాజ్ (ఆటవిక పాలన) తిరిగి రావద్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కేంద్రమంత్రి అమిత్ షా బిహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికలప్రచారంలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళలకు ఖాతాల్లో జమచేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలనిఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆసొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్మును దోచుకోలేంన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ-నీతీశ్ అభివృద్ధి మోడల్‌కు,ఆర్జేడీ, జంగిల్‌రాజ్‌కు మధ్య పోటీ జరుగుతోందని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బిహార్‌ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. బిహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తే 'మిథిలాంచల్'కు సాగునీరుఅందించడానికి, ఆ ప్రాంతంలో వరదలను అరికట్టడానికి, కోషి నది నీటిని ఉపయోగించుకోవడానికి మొత్తం రూ.26,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారు.

**ఎన్డీఏతోనే బిహార్ అభివృద్ధి.. రాజ్‌నాథ్ సింగ్..**
ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తుందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వైశాలి జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కావాల్సిన డబ్బు వారికి ఎక్కడినుంచి వస్తుందని ప్రశ్నించారు. యూపీఏ పాలనలో, కేంద్రం బిహార్‌కు రూ.2 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని.. ఎన్డీఏ పాలనలో మోడీ ప్రభుత్వం పదేళ్లలో రూ.15 లక్షల కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం గురించి ఎన్డీఏ మాత్రమే ఆలోచించగలదని ఆర్జేడీ కాదని విమర్శించారు.

# మహిళలపై వరాల జల్లు.. ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఖాతాలోకి రూ.30వేలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



బీహార్ ఎన్నికల సందర్భంగా మహిళలపై పార్టీలు వరాల జల్లు కురిపిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమిలోని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ కీలక ప్రకటన చేశారు. ఇండియా కూటమి బిహార్ లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే మై బహిన్ మాన్ యోజన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న రాష్ట్రంలోని మహిళలు అందరి ఖాతాల్లో ఏడాదికి రూ.30వేలు జమ చేస్తామని చెప్పారు. డిసెంబర్ 1 నుండి మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఇప్పటికే ప్రకటన చేయగా, మహిళల కోరిక మేరకు ఒకేసారి సంక్రాంతి సందర్భంగా ఖాతాల్లో రూ.30వేలు వేస్తామని మరో ప్రకటన చేశారు. మరోవైపు రాష్ట్రంలోని రైతులు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు వరికి రూ.300, గోదుమలకు బోనస్ రూ.400 చెల్లిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగుల కోసం పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు 70కి.మీల పరిధిలోనే ఉద్యోగ నియామకాలు కల్పిస్తామని చెప్పారు.

# విమాన ప్రయాణికులకు శుభవార్త.. 48 గంటల్లోపు టికెట్ రద్దు, మార్పులు ఉచితం!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పెద్ద ఊరట కలిగించించింది. ప్రయాణికుల కోసం కొత్త నిబంధనలు సిద్ధం చేసింది. ఇకపై ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకున్న 48 గంటల్లోపు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా రద్దు చేసుకోవచ్చు, మార్పులు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనల ప్రకారం.. ప్రయాణికుడు బుకింగ్ చేసిన 48 గంటల్లోపు తన ప్రణాళికలో మార్పులు చేసుకోవాలనుకుంటే, ఎయిర్‌లైన్స్ అదనపు రద్దు ఛార్జీలు వసూలు చేయరాదు. అదేవిధంగా, టికెట్ రద్దు జరిగితే తక్షణ రీఫండ్ ఇవ్వడం తప్పనిసరి అవుతుంది. విమాన ప్రయాణికులకు డైరెక్టోరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పెద్ద ఊరట కలిగించించింది. ప్రయాణికుల కోసం కొత్త నిబంధనలు సిద్ధం చేసింది. ఇకపై ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకున్న 48 గంటల్లోపు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా రద్దు చేసుకోవచ్చు, మార్పులు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనల ప్రకారం.. ప్రయాణికుడు బుకింగ్ చేసిన 48 గంటల్లోపు తన ప్రణాళికలో మార్పులు చేసుకోవాలనుకుంటే, ఎయిర్‌లైన్స్ అదనపు రద్దు ఛార్జీలు వసూలు చేయరాదు. అదేవిధంగా, టికెట్ రద్దు జరిగితే తక్షణ రీఫండ్ ఇవ్వడం తప్పనిసరి అవుతుంది.

# ఖర్గేజీ.. రాహుల్ పెళ్లి ఎప్పుడో చెప్పండి: బీజేపీ సెటైర్లు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తోన్న వేళ రాజకీయ వేడి ముదురుతోంది. ప్రధాన పార్టీల నేతల విమర్శలు, ప్రతి విమర్శలు మరింత పదునెక్కుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. 'బేటే కి షాదీ' అంటూ ప్రధాని మోడీపై విమర్శలుచేశారు. దీనిపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పెళ్లి ఎప్పుడంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అసలేం జరిగిందంటే..ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖర్గే సోమవారం రాజా పకర్‌లో మాట్లాడుతూ ప్రధాని మోడీ పై విమర్శలు చేశారు. "పంచాయతీ దగ్గర్నుంచి.. పార్లమెంట్ వరకు ఎన్నిక ఏదైనా ప్రధాని మోదీ బిజీబిజీగా ప్రచారం చేస్తూనే ఉంటారు. ఇప్పుడు బిహార్‌లో కూడా కుమారుడి పెళ్లి అన్నట్లుగాతిరుగుతూనే ఉన్నారు.ప్రజలు ఎన్నిసార్లు కేవలం మోడీ ముఖాన్ని చూసి ఓట్లు వేస్తారు" అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు విమర్శించారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. మోడీపై అనుచిత విమర్శలు సరికాదంటూ దుయ్యబడుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రిగిరిరాజ్ సింగ్ దీనిపైఎక్స్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. "ఖర్గేజీ మీ కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ) పెళ్లి ఎప్పుడైనా జరిగితే పిలవండి. దానికి మేం కచ్చితంగా హాజరవుతాం" అంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు.బిహార్‌లో నవంబరు 6న తొలిదశ పోలింగ్ జరగనుంది. మొదటివిడతకు మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ క్రమంలోనే నేతల ప్రచార జోరు హెూరందుకుంది. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి మళ్లీ అధికారం చేపడితే బిహార్‌లో మళ్లీ జంగిల్ రాజ్ వస్తుందని ప్రధాని మోడీ సహా ఎన్డీయే నేతలు దుయ్యబడుతున్నారు. ఈ విమర్శలకు కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు కూడా ఘాటుగానే బదులిస్తున్నారు. ఎన్డీయే తిరిగి అధికారంలోకి వచ్చినా.. నీతీశ్‌కుమార్‌ను మాత్రం మళ్లీ ముఖ్యమంత్రిని చేయదని ఖర్గే ఆరోపించారు. మోడీని ఎవరైనా ధైర్యంగా ప్రశ్నించడానికి సాహసం చేస్తే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తారని మండిపడ్డారు.

# నటుడు రవికిషన్‌కు బెదిరింపులు.. ఎట్టకేలకు నిందితుడు అరెస్ట్

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:**



తుపాకీతో కాల్చి చంపేస్తామంటూ ఏకంగా బీజేపీ ఎంపీ, నటుడు రవికిషన్‌కు ఓ ఆగంతకుడు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎంపీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తును ప్రారంభించారు. ఈ మేరకు నిందితుడిని ఇవాళ పంజాబ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి అక్కడ అదుపులోకి తీసుకున్నారు. అయితే, బీజేపీ ఎంపీ రవికిషన్ పీఏ శివమ్ ద్వివేదికి రెండు రోజుల క్రితం ఆగంతకుడు ఫోన్ చేశాడు. యాదవుల గురించి ఎంపీ రవికిషన్ మాట్లాడితే తుపాకీతో కాల్చి చంపేస్తానని.. అయన చేస్తున్న అన్ని పనులు తమకు తెలుసని అన్నాడు. ఎన్నికల్లో ప్రచారం భాగంగా నాలుగు రోజుల్లో బీహార్‌కు వచ్చినప్పుడు ఎంపీ రవికిషన్‌ను హతమార్చుతామంటూ బెదిరించారు. మొదట నిందితుడు బిహార్ రాష్ట్రంలోని ఆరా జిల్లా జవానియా గ్రామానికి చెందిన అజయ్ కుమార్ యాదవ్ అని తెలిసిందే. కానీ, విచారణ భాగంగా నిందితుడు తనది పంజాబ్ అని, మద్యం మత్తులో ఎంపీ వ్యక్తిగత సహాయకుడికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లుగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

# నాకు ఏం జరిగిందో గుర్తులేదా..? థరూర్‌ను హెచ్చరించిన బీజేపీనేత



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
వారసత్వ రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. దీనిపై బీజేపీనేత షెహజాద్ పూనావాలా స్పందించారు. 'నాకు ఏం జరిగిందో మీకు గుర్తులేదా..?' అని హెచ్చరించారు."దశాబ్దాలుగా ఒకే కుటుంబం దేశ రాజకీయాలను శాసిస్తోంది. నెహ్రూ-గాంధీ వంశ ప్రభావం స్వాతంత్ర్య పోరాటంతో ముడిపడి ఉంది. అయితే.. రాజకీయ నాయకత్వమనేది పుట్టుకతో వచ్చే హక్కు అనే ఆలోచననూ ఇది స్థిరపరిచింది. ప్రతి పార్టీ, ప్రాంతం, స్థాయిలోనూ ఇది చొచ్చుకుపోయింది" అని థరూర్ ఒక మీడియా కథనంలో రాసుకొచ్చారు. బిజూపట్నాయక్- నవీన్‌పట్నాయక్ బాల్ ఠాక్రే- ఉద్ధవ్‌ఠాక్రే- ఆదిత్య ఠాక్రే, ములాయం సింగ్ యాదవ్- అఖిలేశ్ యాదవ్, షేక్ అబ్దుల్లా- ఒమర్ అబ్దుల్లా, కరుణానిధి- ఎంకే స్టాలిన్- ఉదయనిధి వంటి ఉదాహరణలు ప్రస్తావించారు. రాజకీయాల్లో ప్రతిభను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. దీనిపై బీజేపీ నేత పూనావాలా ( ఎక్స్ వేదికగా స్పందించారు. "థరూర్ నిప్పుతో చెలగాటమాడుతున్నారు. ఆయన నేరుగా నెపోకిడ్స్ (రాజకీయ వారసులు) గురించి ప్రస్తావించారు. 2017లో వారసత్వం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్ గాంధీని నేను ప్రశ్నించినప్పుడు నాకు ఏం జరిగిందో మీకు గుర్తులేదా సర్..? నేను మీకోసం ప్రార్థిస్తున్నాను. ఆ కుటుంబం ప్రతీకారంతో వ్యవహరిస్తుంది" అని గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆ ఏడాది కాంగ్రెస్‌లో జరిగిన అంతర్గత ఎన్నికల ప్రక్రియను పూనావాలా ప్రశ్నించారు. రాహుల్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించాలని ముందే నిర్ణయించుకున్నారని, హస్తం పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అనేది బూటకమంటూ చేసిన విమర్శలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఆ వ్యవహారం తర్వాత భాజపాలో చేరి, పార్టీ అధికార ప్రతినిధిగా నియ మితులయ్యారు.

# పోర్న్‌సైట్లలో అమ్మకానికి 20 కోట్ల వీడియోలు.. నేపాల్‌ను ఉదాహరణగా చూపిన సుప్రీంకోర్టు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



ఇంటర్నెట్ లో అశ్లీల కంటెంట్ రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనిపై నిషేధం విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ కంటెంట్ వీడియోలు, క్లిప్పులు పిల్లల మనసుల్ని మలినం చేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలకు కారణవుతాయని పిటిషనర్ పిటిషన్ లో ఆవేదన వ్యక్తం చేశారు. పిటిషన్ ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని డివిజనల్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ లో పలు సైట్లపై నిషేధం విధించడం వల్ల నేపాల్ లో చోటుచేసుకున్న పరిణామాలు చూశారు కదా అని పిటిషనర్ ను ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిటిషన్ ను ఇప్పటికిప్పుడు విచారించలేమని పేర్కొంటూ 4 వారాలకు వాయిదా వేసింది. ఈనెల 23న సీజేఐ పదవీ విరమణ చేయనుండగా.. ఈ పిటిషన్ పై విచారణకు ఆయన సుముఖంగా లేనట్లు న్యాయవర్గాల అభిప్రాయపడ్డాయి.ఇక పిటిషనర్ వేసిన పిటిషన్ లో పలు అంశాలను ప్రధానంగా పేర్కొన్నాడు. డిజిటలైజేషన్ తర్వాత దేశంలో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిందని, అక్షరాస్యత, చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ నెట్ వాడుతున్నారని చెప్పాడు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ లోని 69ఏ ఆర్టికల్ ప్రకారం అశ్లీల కంటెంట్ ను ప్రోత్సహించే వెబ్ సైట్లపై నిషేధం విధించే అవకాశం ఉన్నా.. కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ విమర్శించారు.

# పర్వతారోహకులపై విరుచుకుపడ్డ హిమపాతం.. ఏడుగురు మృతి, నలుగురు గల్లంతు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
ప్రపంచ ప్రఖ్యాత పర్వతారోహణ కేంద్రంగా నిలిచిన నేపాల్ మరోసారి విషాదంలో మునిగిపోయింది. హిమాలయ పర్వత శ్రేణుల్లో భాగమైన యాలంగ్ రి పర్వతంపై హిమపాతం విరుచుకుపడింది. దీంతో ఏడుగురు పర్వతారోహకులు దుర్మరణం పాలయ్యారు, మరో నలుగురు గల్లంతయ్యారు. స్థానిక ప్రజలు తెలిపిన సమాచారం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. మొత్తం 15 మంది సభ్యులతో కూడిన పర్వతారోహణ బృందం యాలంగ్ రి పర్వతాన్ని అధిరోహిస్తుండగా, ఒక్కసారిగా భారీగా మంచు విరిగిపడింది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉన్న ఏడుగురు సభ్యులు మంచు కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు ఫ్రెంచ్ పర్వతారోహకులు, ఒక కెనడా పౌరుడు, ఒక ఇటాలియన్, అలాగే ఇద్దరు నేపాలీలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదే ప్రమాదంలో మరో నలుగురు కనిపించకపోవడంతో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్ సైన్యం, స్థానిక రెస్క్యూ టీంలో హెలికాప్టర్ సాయంతో శోధన కార్యకలాపాలు ప్రారంభించాయి. కఠిన వాతావరణ పరిస్థితులు, దట్టమైన మంచు కారణంగా రక్షణ చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయి. గత దశాబ్దంలో హిమాలయ ప్రాంతాల్లో చోటుచేసుకున్న అత్యంత తీవ్రమైన హిమపాతాల్లో ఇది ఒకటిగా అది

# అమెరికాలో హైర్ బిల్లు అమల్లోకి వస్తే.. భారత ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందే: కాంగ్రెస్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
అమెరికాలో ప్రతిపాదించిన అంతర్జాతీయ ఉపాధి తరలింపు నిలిపివేత (హైర్) చట్టంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన ఈ హైర్ బిల్లు సెనెట్ కమిటీ ఆన్ ఫైనాన్స్‌కు పంపినట్లు రమేశ్ పేర్కొన్నారు. దీని ప్రకారం.. అమెరికాలో ఉండే ఓ వ్యక్తి ఔట్ సోర్సింగ్ కింద విదేశీయులను ఉద్యోగులుగా నియమించి వారికి జీతాలు చెల్లించాల్సి వస్తే ఆ మొత్తంలో 25శాతం ప్రభుత్వానికి పన్ను కట్టాల్సి ఉంటుందన్నారు. ఇది అమల్లోకి వస్తే.. భారత్‌పై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. ఈ బిల్లు భారత ఐటీ సేవలు, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్, కన్సల్టింగ్, జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)పై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందన్నారు. ఐర్లాండ్, ఇజ్రాయెల్, ఫిలిప్పీన్స్ వంటి ఇతర దేశాలు కూడా దీనికి ప్రభావితమవుతాయన్నారు. కానీ, ఎక్కువ ప్రభావం మన దేశం పైనే ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బిల్లుకు ఆమోదం లభించవచ్చు.. లభించకపోవచ్చన్నారు. ఇది ఆలస్యమయ్యే అవకాశం కూడా ఉందన్నారు. బ్లూకాలర్ ఉద్యోగాలు చైనాకు తరలిపోయిన నేపథ్యంలో.. వైట్‌కాలర్ ఉద్యోగులు కూడా భారత్‌కు వెళ్లిపోకుండా ఉండేందుకే ఈ బిల్లును ప్రతిపాదించినట్లు తెలుస్తోందన్నారు. ఈ క్రమంలో అమెరికా- భారత్ ఆర్థిక సంబంధాలు ఇంతగా దెబ్బతింటాయని ఏడాదిక్రితం ఎవరూ ఊహించలేదన్నారు. దీనికి హైర్ బిల్లు మరో ఉదాహరణగా అభివర్ణించారు. అమెరికాలో అందించే సేవల కోసం విధులు నిర్వహించే విదేశాల్లోని ఉద్యోగుల జీతభత్యాల మొత్తాలపై 25 శాతం సుంకం విధించాలనేది ఈ చట్టం ప్రతిపాదన. అక్టోబరు 6న సెనెటర్ బెర్నీ మోరెనో దీన్ని సెనెట్‌లో ప్రవేశపెట్టారు. ఇది భారత్‌కు తీవ్ర నష్టమని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పేర్కొన్నారు. హైర్ చట్టం అమల్లోకి వస్తే అన్నిరకాల అవుట్‌సోర్సింగ్ సేవలపైనా సుంకాలు విధించే అవకాశం ఉందన్నారు.

# ఫ్రాంక్ఫర్ట్, జర్మనీలో వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవం!

**విశ్వంభర, నేషనల్ బ్యూరోం**
ఫ్రాంక్ఫర్ట్ , జర్మనీలో తిరుమల వైభవాన్ని ప్రతిబింబిస్తూ, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సహకారంతో, శ్రీ బాలాజీ వేదిక్ సెంటర్ జర్మని ఇ.వి ఆధ్వర్యంలో ఈ దివ్య మహెూత్సవం జరిగింది. టిటిడి డిప్యూటీ.ఇ.ఇ. మల్లయ్య పర్యవేక్షణలో టిటిడి వేద పండితుల బృందం వేద ఆచారాలతో, శాస్త్రోక్తంగా శ్రీవారి కళ్యాణ కృతువును నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, కన్సులేట్ జెనెరల్ శుచితా కిషోర్, , Königstein im Taunus మేయర్ హెల్మ్ ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై, శ్రీవారి దివ్య ఆశీస్సులు పొందారు. విదేశీ నేలపై భారతీయ సంస్కృతికి లభించిన ఈ గౌరవం అందరినీ ఆనందభరితులను చేసింది. ఈ కార్యక్రమ నిర్వాహకులు క్రిష్ణ జవ్వాజి మరియు సూర్య ప్రకాష్ వెలగా మాట్లాడుతూ.. ఫ్రాంక్ఫర్ట్ లో నివసిస్తున్న తెలుగు ప్రజలకు ఈ కల్యాణోత్సవం ద్వారా ఆధ్యాత్మిక అనుభూతి కలిగించగలగడం మా భాగ్యం. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పండితులు, స్వచ్ఛంద సేవకులు, భక్తులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు," అని పేర్కొన్నారు. ఎస్‌విబివిస్ అధ్యక్షులు క్రిష్ణ జవ్వాజి మాట్లాడుతూ.. "ఫ్రాంక్ఫర్ట్ లో నివసిస్తున్న భక్తులకు తిరుమల వాతావరణాన్ని అందించడం మా అసోసియేషన్ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమం శ్రీ బాలాజీ వేదిక్ సెంటర్ జర్మని ఇ.వి బృందం యొక్క అంకితభావం, సమిష్టి కృషి వల్ల జరిగిందన్నారు. కల్యాణోత్సవంలో జర్మనీ దేశంలో మ్యూనిచ్, హాంబర్గ్ ప్రతినిధులు టిట్టు మద్దిపట్ల, డా. శివ శంకర్ లింగం పాల్గొన్నారు. యూరప్ %ಒ% యు.కె కళ్యాణం ప్రధాన కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్ బాబు చలసాని సారధ్యంలో డాక్టర్ శ్రీకాంత్, సుమంత్ కొర్రపాటి శ్రీనివాస కళ్యాణ మహెూత్సవం విజయవంతంగా సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# బెంగళూరు డాక్టర్ హత్యకేసు.. ప్రియురాలిని పట్టించిన డిజిటల్ పేమెంట్ యాప్ మెసేజ్



**విశ్వంభర, బెంగళూరు:**
బెంగళూరులో భర్త చేతిలో హతమైన డాక్టర్ కృతికా రెడ్డి హత్య కేసులో సంచలన విషయం బయటపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 24న కృతికా రెడ్డి (29) మరణించగా.. తన భార్య అనారోగ్యంతో చనిపోయిందని డాక్టర్ మహేంద్రారెడ్డి అందరినీ నమ్మించబోయాడు. కానీ.. పోస్టుమార్టంలో ఆమె మత్తుమందు ఓవర్ డోస్ కారణంగా చనిపోయినట్లు తేలడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని కుటుంబ సభ్యులు, సన్నిహితులను విచారించారు. 6 నెలల తర్వాత భర్తే ఆమెను అంతమొందించినట్లు విచారణలో తేలగా.. అక్టోబర్ 14న మహేంద్రారెడ్డిని అరెస్ట్ చేశారు. భార్య అనారోగ్యానికి గురవ్వగా.. తాను కూడా డాక్టరే కావడంతో మహేంద్రే ఇంట్లో ట్రీట్మెంట్ మొదలుపెట్టాడు. ఆమెను అడ్డు తొలగించుకోవాలని భావించిన అతను.. భార్యకు అనుమానం రాకుండా.. మత్తుమందును హై డోస్ లో ఇంజక్ట్ చేశాడు. ఏప్రిల్ 21 నుంచి 24 వరకూ ఇచ్చిన మత్తుమందు కారణంగా ఆమె చనిపోయింది. ఆమె మరణాన్ని నిర్ధారించుకున్న వెంటనే తన ప్రియురాలికి నీకోసం నా భార్యను చంపేశా అంటూ.. డిజిటల్ పేమెంట్ యాప్ లో మెసేజ్ చేశాడు. అతడి ఫోన్ ను పరిశీలిస్తున్న క్రమంలో తాజాగా ఈ మెసేజ్ బయటపడింది. కానీ ప్రియురాలి వివరాలు వెల్లడించలేదు. ఆమె చెప్తేనే డాక్టర్ తన భార్యను చంపేశాడా? వంటి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఆమె స్టేట్మెంట్ ను రికార్డు చేసినట్లు పోలీసులు తెలిపారు.